సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 138 | మంగళవారం, 07 అక్టోబర్ 2025



# సుప్రీం కోర్టు తీర్పు శుభపరిణామం

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

3 లో




# స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- హనుమకొండలో ఉన్నతాధికారుల సమీక్ష
- పాల్గొన్న కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** స్థానిక సంస్థల ఎన్నికలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతునట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. సోమవారం హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్, రిజ్వాన్ బాషా షేక్, డీసీపీలు, ఏసీపిలు, జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్ పోస్టుల ఏర్పాటు, బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికలకు సంబంధించి సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. గత ఎన్నికల నిర్వహణలో అనుసరించిన విధానం, నమోదైన కేసులపై పరిశీలన చేయాలని అధికారులకు, ఏసీపిలకు కమిషనర్ సూచించారు. రూట్ లు, జోన్ల వారిగా మ్యాపులను సిద్ధం చేయాలన్నారు. జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్టు లను, ఎస్ఎస్టీ బృందాలను ఏర్పాటు చేసి డబ్బు, మద్యం తరలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి చర్చించిన అంశాలలో పోలీస్ శాఖ తరపున చేయాల్సిన అన్ని చర్యలు చేపడతామన్నారు.ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రూట్ మ్యాపులను ఎంపీడీవో లు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రెండు రెవెన్యూ డివిజన్ల వారీగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్ పోస్ట్, ఎస్ఎస్ టి బృందాలు తనిఖీలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు నియమించు సిబ్బంది, పోలింగ్ కేంద్రాల, రూట్ ల ఏర్పాటు పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు. జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులు సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో సజావుగా ఎన్నికల నిర్వహణపై సమీక్ష చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అంత సిద్ధంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, జడ్పీ సీఈఓలు రవి, రామ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారులు కల్పన, లక్ష్మీ రమాకాంత్, సస్వరూప, ఆర్డిఓ ఉమారాణి, ఇతర అధికారులతో పాటు ఏసీపీలు పాల్గొన్నారు.



# ఎలక్షన్ కోడ్ పక్కాగా అమలు చేయాలి


## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలక్షన్ కోడ్ పక్కాగా అమలు అయ్యేలా అధికారులు విధులను నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి పోలీస్, రెవిన్యూ, ఎంపీడీఓ మొదలగు శాఖలకు చెందిన జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిటికల్, సెన్సిటివ్ పోలీస్ స్టేషన్లను మరొకసారి క్షేత్ర స్థాయిలో పరిశీలించి రేపటిలోగా నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్, పోలీస్, ఎంపీడీఓ అధికారులు సమన్వయంగా పని చేయాలన్నారు. మండల స్థాయి లో ఏర్పాటు చేయాలిసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు సరైన కార్యాలయం ప్రదేశాన్ని ఎంపిక చేయాలన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ ఎస్ టి టీంలలో విధులు నిర్వహించే అధికారులకు ఒరియేంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్ ల ద్వారా ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్క అధికారికి మరోసారి ఎన్నికల నిర్వహణ పైన ఉన్న సందేహాలను నివృత్తి చేపించాలన్నారు. ఈ గూగుల్ మీటింగ్ లో అదనపు కలెక్టర్లు, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవోలు, ఏసీపీలు, జడ్పీ డిప్యూటీ సీఈఓ సరిత, డీపీవో, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్ హెచ్ ఓలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


### స.హ చట్టంపై అవగాహన అవసరం

సమాచార హక్కు వారోత్సవాలను జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి మొదలైన సమాచార హక్కు చట్ట వారోత్సవాలలో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, సమాచార హక్కుచట్టం అమలుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారీతనం మొదలగు అంశాల మీద అవగాహనను పెంచడానికి, ప్రజలకు ఈ చట్టం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ వారోత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.




## మల్లన్న ఆలయానికి విరాళం

**కొముురవెల్లి, మన చౌరాస్తా :** కొముురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో కరీంనగర్ జిల్లా దుర్దేడ్ గ్రామానికి చెందిన రా పెల్లి దివ్య మహేష్ దంపతులు కొమరవెల్లి మల్లన్నకు అన్న ప్రసాద వితరణకు మహారాజ పోషకులుగా శాశ్వత సభ్యులుగా 1,00,116 రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాణాధికారి వెంకటేష్, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవన్ మల్లికార్జున్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## రెండు ఐకేపీ సెంటర్లు నిర్వహించాలి

### జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఈ సీజన్లో రెండు ఐకేపీ సెంటర్లు నిర్వహించాలని జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ జనగామలో రైతులకు తాము నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి రైతుకు అండగా ఉంటున్నామని అన్నారు. అదేవిధంగా కొన్ని సందర్భాల్లో ఇంటర్నేషనల్ ఎక్స్పోర్ట్ ధరలు తక్కువ ఉన్నందున ప్రైవేటు వ్యాపారస్తులు రైతులకు తక్కువ ధరలో కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా ప్రజా ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర పొందాలని ఉద్దేశంతో తొందరలో రెండు ఐకెపి సెంటర్లు (కొనుగోలు కేంద్రాలు) నిర్వహించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఇందుకు కలెక్టర్ సానుకులంగా స్పందించి ఐకేపీ సెంటర్లు ఏర్పాటుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ బెన్సీ లోమ్, డీఆర్డీవో పీడీ వసంత, ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జీవన్ కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మారం శ్రీనివాస్ తండ్రి ఇటీవల మృతి చెందగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాలకుర్తి మండలంలోని ముత్తారం గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిన కుమార్ సతీమణి బోయిన లలిత ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్, నాయకులు ఉన్నారు.

## డీజీపీని కలిసిన రాజిరెడ్డి



**మన చౌరాస్తా, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నియమితులైన శవధర్ రెడ్డిని ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హైదరాబాద్ మెట్రో వాటర్ సర్వీసెస్ ఎస్.బి. ట్రేడ్ యూనియన్స్ జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మొగుళ్ల రాజిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీకి రాజిరెడ్డి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## 8న సోమన్న హుండీ లెక్కింపు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 8న ఉదయం 10:30 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు సోమవారం తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలోని కళ్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.



## అభివృద్ధి పనుల పరిశీలన

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో ఆఫీస్‌ను సందర్శించి, ఎలక్షన్ ప్రక్రియ పనులను చెక్ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బీ ఈఈ, తహసీల్దార్ ఉన్నారు.





# జిల్లాలో 309 కేంద్రాలు

- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
- రైతులకు ఇబ్బంది కలగొద్దు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** గత రెండు సీజన్లలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగిందని, ఈసారి కూడా పక్కా ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వానాకాలం(ఖరీఫ్) పంట కొనుగోలుకు సంబంధించి ఆర్డీఓ, సివిల్ సప్లై, డీఆర్డీఓ, మార్కెటింగ్, మార్క్ ఫెడ్, జిల్లా, మండల, గ్రామ స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్టీఓ, గన్ని గోదాం ఇంచార్జిలు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్లతో సోమవారం కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హల్ లో కలెక్టర్ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 2,13,978 ఎకరాల్లో వరి పంట సాగు అయ్యిందని, 5,43,057 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా కాగా 2,05,057 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు వస్తుందని అంచనా వేసి అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామన్నారు. సన్న రకానికి మద్దతు ధర 2,389 రూపాయలు కాగా బోనస్ గా కింటల్ కి 500 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే దొడ్డు రకానికి 2,369 రూపాయల మద్దతు ధర ఉందన్నారు. దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కోసం ఐకేపీ 116, పాక్స్ 82 కేంద్రాలను, అలాగే సన్నరకం ధాన్యం కొనుగోలు కై 69 ఐకేపీ, 42 పాక్స్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నమన్నారు. ప్రతి కేంద్రంలో కొనుగోలుకు సంబందించిన రిజిస్టర్ లు,తేమ యంత్రాలు,ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు,టార్పాలిన్ మొదలగు వసతులు ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఏ రోజు వచ్చిన ధాన్యం అదే రోజు కొనుగోలు అవ్వాలని రైతులు వెయిటింగ్ చేసే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రతి కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అన్ని రిజిస్టర్ లు అప్ డేట్ గా ఉండే విధంగా మెయింటైన్ చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రదర్శించాలన్నారు. ఎంత ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేసారు,తేమ శాతం ఎంత ఉంది,రైస్ మిల్ కు ఎంత ధాన్యం పంపించారు, ఎంత మంది రైతుల కు పే మెంట్ అయ్యింది మొదలగు వివరాలన్నీ ప్రతి కేంద్రంలో ఉండాలన్నారు. అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని,కోనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులను నిర్వాహకులు కల్పించాలన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తేమ శాతం చూసుకొని నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చేలా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఏ రోజుకారోజు కొనుగోలు అయిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేసి రైతుల ఖాతాలో త్వరగా నగదు జమ అయ్యేల పర్యవేక్షణ జరగాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా నిర్వాహకులు తగు జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్, రూరల్ అధ్యక్షుడు బెలిదే వెంకన్న, జిల్లా సివిల్ సప్లై అధికారి సరస్వతి, పౌరల పౌరసరఫరాల సంస్థ డీఎం నాయక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వసంత, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సరిత పాల్గొన్నారు.





# బీఆర్ఎస్ ఆశావహుల దరఖాస్తులు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు బచ్చన్నపేట మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బోడిగం చంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ఆశావహుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల కోసం ఆశావహులు పెద్ద సంఖ్యలో హాజరై తమ దరఖాస్తులను సమర్పించారు. బచ్చన్నపేట మండల పరిధిలో జడ్పీటీసీ పదవికి 18 మంది, ఎంపీటీసీ పదవికి 76 మంది, అలాగే సర్పంచ్ పదవికి 120 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

**హైదరాబాద్, మన చౌరాస్తా :** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ అంశం హైకోర్టులో పెండిరగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండిరగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, అభిషేక్ సింఘ్వీ, ఏడీఎన్ రావు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరపు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీం కోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసిందివసంది. దీంతో బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ లభించింది. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ని విచారించడానికి నిరాకరించింది సుప్రీంకోర్టు. తెలంగాణ హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండిరగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు తెలిపారు. హైకోర్టులో పిటిషన్లు పెండిరగ్‌లో ఉన్నందున... విచారణకు స్వీకరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఎలా జోక్యం చేసుకుంటుందని ప్రశ్నించింది ధర్మాసనం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, జీవో నెంబర్` 9ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు స్వయంగా తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. వీరు సీనియర్ న్యాయవాదులతో ఆదివారం నుంచి మంతనాలు జరిపారు. ప్రభుత్వ వాదనలను గట్టిగా వినిపించాలని కోరారు. దీంతో ఇక ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లేందుకు దాదాపుగా మార్గం సుగమమయ్యిందని భావిస్తున్నారు.

## సుప్రీం తీర్పు శుభపరిణామం

- 42 శాతం రిజర్వేషన్లకు ధోకా లేదు
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మన చౌరాస్తా :** బీసీ రిజర్వేషన్ల పిటిషన్‌కు కొట్టివేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల కాంగ్రెస్ నేతలు స్పందించారు. పీసీసీ చీప్ మహేష్ గౌడ్ స్పందిస్తూ.. సుప్రీం తీర్పు శుభ పరిణామమన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీం కోర్టులో వేసిన కేసును కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిందని తెలిపారు. 8వ తేదీన హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు సహకరించాలని మహేష్ గౌడ్ కోరారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్ అన్నారు. బీసీ బిడ్డలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇస్తే కొందరు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధిగా ఉందన్నారు. బీజేపీ బీఆర్ఎస్‌లు చేస్తున్న కుట్రలను బీసీలు అర్థం చేసుకోవాలని అన్నారు. బీసీ బిడ్డల నోటి దగ్గర ముద్దను లాక్కోవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతలు కుల సంఘ నాయకుని ముద్ర వేసుకుని కోర్టుకు వెళ్తున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్ల పెంపును అడ్డుకునే ఉత్సాహాన్ని బీసీలు గమనిస్తున్నారని మహేష్ పేర్కొన్నారు.








# మళ్లీ తెరపైకి సమంత

## 'మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు

స్టార్ హీరోయిన్ సమంత చాలా రోజుల తర్వాత మళ్లీ సిల్వర్ స్క్రీన్‌కి రాబోతున్నారు. హెల్త్ ప్రాబ్లం కారణంగా సినిమాలకు కొంత బ్రేక్ ఇచ్చిన సమంత తర్వాత ప్రొడ్యూసర్ గా ఎంట్రీ ఇచ్చి తన ప్రొడక్షన్ హౌస్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరిట 'శుభం' మూవీతో నిర్మాతగా తన అడుగులు పెట్టి మొదటి చిత్రం తోనే హిట్ అందుకుంది. ఇప్పుడు మరో ప్రాజెక్ట్ 'మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు రాబోతుంది. గతేడాది ఈ మూవీ నుండి విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో సమంత గన్, మెడలో తాళి బొట్టు, రక్తంతో నిండిన ముఖంతో ఫుల్ డ్రామా లుక్‌లో కనిపించారు. ఈ లుక్ చూసిన ఫ్యాన్స్ ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందని ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఆ అప్‌డేట్ కోసం సోషల్ మీడియా ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పుడు ఈ నెలలోనే 'మా ఇంటి బంగారం' షూటింగ్ ప్రారంభం అవుతుంది అంటూ సమంత స్వయంగా తెలిపారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్. చాలా రోజుల తర్వాత సమంతను మళ్లీ స్క్రీన్‌లో చూడబోతున్నాం అంటూ మురిసి పోతున్నారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ వార్త ట్రెండ్ అవుతోంది.



## మహానటిలో ఎఎన్నార్ పాత్ర

# నా అదృష్టం

### నటుడు నాగచైతన్య వెల్లడి

'మహానటి' సినిమాలో పాత్రను తప్పించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు నటుడు నాగచైతన్య తెలిపారు. జీ5లో ప్రసారమయ్యే 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే, ప్రతి ఒక్కరి జీవితంలో ఒడుదొడుకులు ఉంటాయని, వాటి నుంచి పాఠం నేర్చుకొని పాజిటివ్‌గా ఆలోచిస్తూ ముందుకు వెళ్తే జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. మహానటి' సినిమా గురించి ఆయన గుర్తుచేసుకుంటూ.. 'నాగ్ అశ్విన్ నాకు 'మహానటి'లో తాతయ్య పాత్ర (ఏఎన్ఆర్) చేయాలని చెప్పగానే తప్పించుకోవడానికి చాలా ప్రయత్నం చేశా. ఎందుకంటే ఆయన లాగా నటించడం మరొకరికి సాధ్యం కాదు. 'నేను ఏఎన్నార్‌లా చేయడం ఏంటి?. నా వల్ల కాదు. అది అసాధ్యం. మర్చిపోండి' అని నాగ్ అశ్విన్‌తో చెప్పాను. పైగా ఆ సమయంలో 'సవ్యసాచి' షూటింగ్ చేస్తున్నా. గడ్డంతో డిఫరెంట్ లుక్‌లో ఉన్నా. ఆ సినిమాలో ఏఎన్నార్ పాత్రకు ఈ లుక్ సరిపోదని కారణం చెప్పి తప్పించుకోవాలనుకున్నా. గడ్డం తీయలేనని పంపించేశా. మళ్లీ నెలన్నర తర్వాత నాగ్ అశ్విన్ నా దగ్గరకు వచ్చాడు. 'వీఎఫ్ఎక్స్‌లో గడ్డం తీసేస్తాను. ఈ క్యారెక్టర్‌లో నువ్వు మాత్రమే నటించాలి' అని పట్టుబట్టాడు. దీంతో ఓకే చెప్పానన్నారు. తర్వాత ఆలోచిస్తే ఒక విషయం అర్థమైంది. ఒకవేళ నేను చేయకపోతే వేరే నటుడు ఆ పాత్రలో చేస్తాడు. తాతయ్యగా వేరే వాళ్లు చేయడమంటే నా మనసు అంగీకరించదు. నాకు ఆఫర్ వచ్చాక.. నేనుండగా ఆ పాత్ర మరొకరు చేయడం ఏంటి? అనిపించింది. ఎవరేమనుకున్నా చేయాలి అని నిర్ణయించుకున్నా. ఆయనలాగా నేను నటించడం నాకు దక్కిన అదృష్టమని భావించాను. ఆయనపై నా ప్రేమను చూపించడానికి నాకు దక్కిన అవకాశమని అంగీకరించానని నాగచైతన్య చెప్పారు.